క్లుప్తంగా

## పల్స్ పోలియోపై సమావేశం


వైద్య సిబ్బందితో మున్సిపల్ కమిషనర్

**కోరుట్ల:** మార్చి 3 వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి తీసుకోవాల్సిన చర్యలపై మున్సిపల్ కమిషనర్ తిరుపతి, వైద్య సిబ్బందితో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోలియో కేంద్రాలు, అవసరమైన సిబ్బంది, పిల్లల సంఖ్య ఇతరత్రా అంశాలపై చర్చ జరిపి అవసరమైన పూర్తి ఏర్పాట్లు చేస్తామని మున్సిపల్ కమిషనర్ తిరుపతి వెల్ల డించారు.

## అక్రమ నిర్మాణం తొలగించాలని ఫిర్యాదు


కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

**కోరుట్ల:** పట్టణంలోని గోదాం రోడ్ ఏరియాలోని రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం పక్కన రోడ్డులో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానికులు మున్సిపల్ కమిషనర్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. రోడ్డు మూసివేయటంతో రాకపోకలు ఇబ్బందిగా మారాయని అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని కమిషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో కోరారు. కార్యక్రమంలో గోదాం ఏరియా కాలనీవాసులు పాల్గొన్నారు.

## పాఠశాలకు కంప్యూటర్లు వితరణ


కంప్యూటర్ ల్యాబ్‌లో విద్యార్థులు

**మేడిపల్లి:** భీమారం జిల్లా పరిషత్ పాఠశాలకు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ 10 కంప్యూటర్లు అందజేసినట్లు విద్యాకమిటీ చైర్మన్ నాంపెల్లి లక్ష్మీనర్సయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

## శివరాత్రి ఉత్సవాలు విజయవంతం చేయాలి


ఉత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

**పెగడపల్లి:** మండల కేంద్రంలోని శ్రీస్వయంభూ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 6 నుంచి 9 వరకు జరుగనున్న శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అందరు సహకరించాలని చైర్మన్, ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి, పోచయ్య, సభ్యులు కోరారు. ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ముద్రించిన శివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ప్రచార పోస్టర్లను బుధవారం ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా 6, 7ప్రత్యేక పూజలు, హోమాలు, 8న స్వామి వారి కల్యాణం, 9 న బలిదానం, అన్నదానం కార్యక్రమాలు జరుగుతాయని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ఎంపీటీసీ జమున-స్వామి, ఆలయ కమిటీ సభ్యులు, ఆటో యూనియన్ నాయకులు, శివ స్వాములు పాల్గొన్నారు.

## ఖోఖోలో విద్యార్థికి వెండి పతకం


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్,టీచర్లు

**కోరుట్ల:** పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థి గుగులోతు వినయ్ జార్ఖండ్‌లో జరిగిన నేషనల్ స్కూల్ 67 ఖోఖో గేమ్స్‌లో పాల్గొని వెండి పతకం సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని బుధవారం ప్రిన్సిపాల్ బాబూ, వైస్ ప్రిన్సిపాల్ ప్రేమలత, పీఈటీలు, ఉపాధ్యాయులు అభినందించారు.

# కోరుట్ల మార్కెట్ పీఠం దక్కేదెవరికో?

- జనరల్ మహిళకు రిజర్వేషన్
- పదవి కోసం తీవ్ర పోటీ
- ఆశల పల్లకిలో ఆశావహులు
- జువ్వాడి ఆశీస్సులు ఎవరికో?


కోరుట్ల మార్కెట్ కమిటీ యార్డు

**కోరుట్లరూరల్:** రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తుందనే ప్రచారంతో ఆశావహుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కోరుట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై చాలా మంది ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో తీయటంతో రిజర్వేషన్ పద్ధతిలో భర్తీ చేయనున్నారు. మార్కెట్ కమిటీల పదవీ కాలం రెండేళ్లే అయినప్పటికీ బీఆర్ఎస్ హయాంలో గత పదేళ్లలో రెండు సార్లు మాత్రమే మార్కెట్ కమిటీ పాలక మండళ్లను నియమించి రెండేళ్ల పదవీ కాలాన్ని పొడిగిస్తూ వచ్చారు. మొదటి సారి జనరల్ కాగా, రెండోసారి బీసీ మహిళకు రిజర్వు అయ్యింది. ప్రస్తుతం జనరల్ మహిళకు రిజర్వు కానుందనే ప్రచారం జోరందుకుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని పదేళ్ల పాటు పార్టీకి అంకిత భావంతో పని చేసిన నేతలతో పాటు ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీలో చేరిన నేతలు సైతం అధ్యక్ష పదవిని ఆశిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

**వీరే ఆశావహులు..**

మార్కెట్ కమిటీ చైర్మన్ జనరల్ మహిళ అయితే సంగెం గ్రామానికి చెందిన యెన్నమనేని మంజుల ఈ పదవిని ఆశిస్తున్నారు. వెలమ సామాజిక వర్గానికి చెందిన మంజుల గత ఇరవై ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీ కార్యక్రమాల్లో, ప్రచారంలో చురుగ్గా కొనసాగుతూ, జువ్వాడి కుటుంబానికి సన్నిహితంగా ఉంటున్నారు. అయిలాపూర్ గ్రామానికి చెందిన చింతకుంట సంజీవ రెడ్డి తన భార్య వనితకు మార్కెట్ అధ్యక్ష పదవి ఆశిస్తున్నారు. వనిత గత ఎంపీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆమె, భర్త సంజీవ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటంతో మార్కెట్ కమిటీ జనరల్ అయితే తనకు, జనరల్ మహిళ అయితే తన భార్య వనితకు ఇవ్వాలని సంజీవ రెడ్డి కోరుతున్నట్లు వినికిడి. అదే విధంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొంతం రాజం కూడా ఈ పదవిని ఆశిస్తున్నట్లు తెలిసింది. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన రాజం ఇరవై ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. రాజం భార్య కొంతం రాజు గతంలో కాంగ్రెస్ నుంచి కోరుట్ల జెడ్పీటీసీగా గెలుపొందారు. తన భార్య రాజుకు ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిసింది. అయిలాపూర్ గ్రామానికి చెందిన మరో బీసీ నేత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెరుమండ్ల సత్యనారాయణ గౌడ్ కూడా మార్కెట్ కమిటీ అధ్యక్ష స్థానం ఆశిస్తున్నట్లు వినిపిస్తుంది. జనరల్ మహిళకు రిజర్వు అయిన పక్షంలో తన భార్యకు కావాలని ఆశిస్తున్నట్లు సమాచారం. ఆశావహులు నలుగురిలో ముగ్గురు అయిలాపూర్ గ్రామానికి చెందిన వారే కావటంతో అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందోననే సందిగ్ధత నెలకొంది. ప్రస్తుతం ఈ నలుగురి పేర్లే వినిపిస్తున్నప్పటికీ మార్కెట్ కమిటీ పాలక మండళ్లకు ప్రభుత్వ నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ఇంకెవరైనా తెర పైకి వస్తారా అనే అంశంపై మండలంలో చర్చ కొనసాగుతోంది. సామాజిక వర్గాల సమీకరణ, పార్టీ పరిస్థితను దృష్టిలో ఉంచుకొని జువ్వాడి ఆశీస్సులు ఎవరికి దక్కుతాయో వేచి చూడాలి.

# ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం


నామాపూర్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ప్రదర్శనలు



సైన్స్‌డే ఆకారంలో మల్లాపూర్ విద్యార్థులు

**మెట్‌పల్లి రూరల్/పెగడపల్లి/ధర్మపురి, /బుగ్గారం మల్లాపూర్/కథలాపూర్/సారంగాపూర్:** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్, కేజీబీవీలు, ప్రైవేట్ పాఠశాలల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు ఇచ్చారు.సైన్స్ శాస్త్రవేత్తల జీవిత విశేషాలు, వారు ప్రపంచానికి అందించిన సేవల గూర్చి వివరించారు. వైజ్ఞానిక ప్రదర్శనలతో పాఠ్యాంశాలను విద్యార్థులు సులువుగా అర్థం చేసుకుంటారన్నారు. కార్యక్రమాల్లో హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లు, సైన్స్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలు ప్రారంభం


బీర్‌పూర్ కళాశాలలో పరీక్ష కేంద్రంలో విద్యార్థులు


మల్లాపూర్ పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

**మెట్‌పల్లిరూరల్/ ఇబ్రహీంపట్నం/ మల్లాపూర్/ మల్యాల/సారంగాపూర్:** ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మెట్‌పల్లిలో 646 మంది విద్యార్థులకు 628 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇబ్రహీంపట్నంలో 237 మందికి 229 మంది విద్యార్థులు, మల్లాపూర్‌లో 201 మంది విద్యార్థులకు,195 మంది విద్యార్థులు, మల్యాలలో 420 మందికి 411 మంది, సారంగాపూర్‌లో 82 మంది విద్యార్థులకు 75 మంది విద్యార్థులు, బీర్‌పూర్‌లో 93 మందికి 89 మంది విద్యార్థులు హాజరయ్యారు.

## విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీసేందుకే సైన్స్ ఫెయిర్

- ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

**కోరుట్ల/కోరుట్ల రూరల్:** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభ వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్ ఉపయోగ పడుతుందని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. జాతీయ సైన్స్ ఫెయిర్ సందర్భంగా బుధవారం వివిధ పాఠశాలల్లో సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. పట్టణంలోని నవజ్యోతి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రయోగాలు, శ్రీ చైతన్య విద్యాలయంలో విద్యార్థులు సేంద్రియ వ్యవసాయ సాగు అంశాన్ని ప్రదర్శించగా ఎమ్మెల్యే సంజయ్ తిలకించారు. యెఖీన్‌పూర్ ఉన్నత పాఠశాలతో పాటు వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సైన్స్ ప్రదర్శనలు నిర్వహించి ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

**చెక్కు అందజేత**

**ఇబ్రహీంపట్నం:** మండలంలోని యామాపూర్‌కు చెందిన నడ్పిరాజం విద్యుత్ షాక్‌తో మృతిచెందగా, బాధిత కుటుంబానికి విద్యుత్ శాఖ నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును బుధవారం ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అందజేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ తిరుపతి, ఏడీఈ మనోహర్, ఏఈ లు సతీశ్, అమరేందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు ఎలాల దశరథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## నిరుపేద దంపతులకు కానుకలు అందజేత

**గొల్లపల్లి:** మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన ఎండీ రజాక్ నిరుపేద దంపతుల కూతురు వివాహానికి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సతీమణి కాంతా కుమారి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. వారికి చీర,సారె,కానుకలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు కాశ గంగాధర్, లచ్చయ్య, రాజవెల్లి, అజీమ్, తదితరులు పాల్గొన్నారు.

**పేదింటి అమ్మాయి వివాహానికి సాయం**

**మల్లాపూర్:** మండలంలోని వాల్గొండకి చెందిన పేద అమ్మాయి లావణ్య వివాహానికి బుధవారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో వివాహ సామగ్రి అందజేశారు. పుస్తెమెట్టెలు, స్టీల్ సామగ్రి, పట్టుచీర, 25 కిలోల బియ్యం, వంటసరుకులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు,ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## సాత్విక్‌కు మరో బంగారు పతకం


గోల్డ్ మెడల్ అందుకుంటున్న సాత్విక్

**మల్యాల:** మండల కేంద్రానికి చెందిన చిలుక సాత్విక్ పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో వాస్తు శాస్త్రం ఆర్కిటెక్చర్‌లో గోల్డ్‌మెడల్ సాధించి, బుధవారం హైదరాబాద్‌లోని శ్రీపొట్టి శ్రీరాములు యూనివర్సిటీ 16వ స్నాతకోత్సవంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ తంగెడ కిషన్ రావు చేతుల మీదుగా గోల్డ్‌మెడల్‌తోపాటు, ప్రశంసాప్రతం అందుకున్నారు. సాత్విక్ 2022లో జేఎన్‌టీయూ బీటెక్‌లో సివిల్ ఇంజినీరింగ్‌లో గోల్డ్‌మెడల్ అందుకున్నారు. ఉత్తమ ఇంజినీర్ 2023గా అవార్డు సాధించాడు. మల్యాలకు చెందిన సాత్విక్ రెండుసార్లు గోల్డ్ మెడల్ సాధించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## ఉద్యోగి బ్యాంకు ఖాతాకే నగదు జమ చేయడం హర్షణీయం

**జగిత్యాలటౌన్:** ఫైనల్ లోన్ నగదును ఉద్యోగి బ్యాంకు ఖాతాలో డైరెక్ట్‌గా జమచేసేలా జెడ్పీ సిఈవో ఉత్తర్వులు జారీచేయడంపై ఎస్టీయూ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మచ్చ శంకర్, బైరం హరికిరణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఈ బదిలీలు డీడీవో అకౌంట్‌కు బదిలీ చేసేవారని దాంతో ఉద్యోగులు ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. దీనిపై ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

**మోచీ సంఘం సభ్యులపై కేసు**

**మెట్‌పల్లిరూరల్:** మెట్‌పల్లి పట్టణంలోని పలువురు మోచీ సంఘం సభ్యులపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. మోచీ సంఘంలోని సభ్యులు రెండు వర్గాలుగా విడిపోయి, మరో వర్గం వారిని కుల బహిష్కరణ చేశారు. దీనిపై కావల్ల పెంటయ్య అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**ఇబ్రహీంపట్నం:** కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీల పథకంలో భాగంగా రూ.500 సిలిండర్, గృహలక్ష్మీ పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత కరెంట్ పథకాలు ప్రారంభించడంతో బుధవారం మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పానకంటి వెంకట్, ఎంపీటీసీలు జైలేష్, తిమ్మని రాములు, కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు లక్కిడి నర్సయ్య, నాయకులు రాజు, తదితరులు పాల్గొన్నారు.

**పెగడపల్లి:** ఆరు గ్యారంటీల్లో మరో రెండు గ్యారంటీ స్కీంలు ప్రభుత్వం అమలు చేయడంతో మండల కాంగ్రెస్ శ్రేణులు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములుగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, మాజీ విండో చైర్మన్ లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

## పదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

**కథలాపూర్:** మండలంలోని అంబారిపేట జెడ్పీ హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్ గౌడ్ బుధవారం పరీక్ష సామగ్రి అందజేశారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడులు, పెన్నులు, పెన్సిళ్లు అందించామని పేర్కొన్నారు. ఎస్సెస్సీలో వంద శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు రూ. 5 వేలు నగదు అందిస్తామని, పాఠశాలలోని ఐదుగురు పేద విద్యార్థులను ఇంటర్, డిగ్రీ వరకు చదివించేందుకు ఆర్థిక సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

## మాదిగ రాజకీయ పోరాట సమితి నూతన కార్యవర్గం

**గొల్లపల్లి:** మాదిగ రాజకీయ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చెవులమద్ది శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాదిగ రాజకీయ పోరాట సమితి మండల నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చెవులమద్ది సంతోష్ తేజ, ప్రధాన కార్యదర్శి నక్క చైతన్య ఎనుకున్నారు. కార్యక్రమంలో గంగాధర్, అంజయ్య, అనిల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడి చదవాలి


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

**కథలాపూర్:** విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నరేశ్ అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు బుధవారం ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు సలహాలు సూచనలు అందించారు. అనంతరం విద్యార్థులు ఆట, పాటలతో సందడి చేశారు.

# ఘనంగా టైలర్స్ డే సంబరాలు


వేడుకల్లో పాల్గొన్న మేరు సంఘం సభ్యులు

**రాయికల్:** పట్టణంలోని మేరు సంఘం ఆధ్వర్యంలో బుధవారం టైలర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కుల దైవం శ్రీ శంకరదాసమయ్యకు పూజలు చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సింగు వెంకట్రాములు, నాయకులు రమేశ్, నరేందర్, శాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

**మల్యాలలో..**

మల్యాల: మండల కేంద్రంలో బుధవారం టైలర్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా టైలర్ దుకాణాదారులు కేక్ కట్ చేశారు. టైలర్లను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో టైలర్లు సంజీవ్, రామగిరి మురళీ, గౌరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## టౌన్ ప్లానింగ్ అధికారిని నియమించాలని వినతి

**రాయికల్:** రాయికల్ మున్సిపల్‌కు టౌన్ ప్లానింగ్ అధికారిని నియమించాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు బుధవారం తెలిపారు. పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో పట్టణంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇన్‌చార్జి అధికారులు సరిగా రావడంలేదన్నారు. పూర్తిస్థాయి అధికారిని నియమించాలని వినతిపత్రంలో కోరారు.

## సీసీరోడ్డు పనులు ప్రారంభం

**పెగడపల్లి:** మండలంలోని నర్సింహునిపేటలో సీసీరోడ్ల నిర్మాణ పనులు బుధవారం ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఉపాధిహామీ నిధులు రూ. 5 లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. పీఆర్ఏఈ షంషేర్ అలీ, పంచాయతీ కార్యదర్శి పద్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**జగిత్యాలక్రైం:** పట్టణ శివారులోని పొన్నాల గార్డెన్ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను బుధవారం ఉదయం పట్టణ ఎస్సై మన్మథరావు పట్టుకుని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మేడిపల్లి మండలం కమ్మరిపేట నుంచి రెండు ఇసుక ట్రాక్టర్లు అక్రమంగా జగిత్యాలకు తీసుకవస్తుండగా పోలీసులు పట్టుకుని ట్రాక్టర్ యజమానితో పాటు ట్రాక్టర్ల డ్రైవర్లపై కేసు నమోదు చేశారు.

## ప్రోటోకాల్ గురించి మాట్లాడే అర్హత ఎమ్మెల్యేకు లేదు

**ఇబ్రహీంపట్నం:** జిల్లా పరిషత్ సమావేశంలో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ప్రోటోకాల్ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని, ఆయనకు మాట్లాడే అర్హత లేదని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఎమ్మెల్యే సంజయ్ నాన్న ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అభివృద్ధి పనుల్లో ప్రోటోకాల్ గుర్తురాలేదా అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావుపై మాట్లాడటం సరికాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దుదిగాం గంగాధర్, బీసీ సెల్ అధ్యక్షుడు బూస రాజేశ్, మహిళ అధ్యక్షురాలు లక్కిడి నర్సక్క, ఎంపీటీసీలు, జైలేష్, రాములు, నాయకులు పాల్గొన్నారు.

## నితిన్‌కు 'డాక్టరేట్ ఆఫ్ మెడిసిన్' పట్టా

**జగిత్యాలజోన్:** జిల్లా కేంద్రానికి చెందిన ఓరుగంటి నితిన్‌రావు కార్డియాలజీ విభాగంలో డాక్టరేట్ ఆఫ్ మెడిసిన్ పట్టా అందుకున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ 26వ స్నాతకోత్సవాన్ని బెంగళూర్‌లో నిర్వహించగా.. గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్, రాష్ట్ర వైద్య విద్యాశాఖ మంత్రి శరణ్ ప్రకాశ్ ఆర్.పాటిల్, హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఎంకే.రమేశ్ నుంచి నితిన్ పట్టా కుటుంబసభ్యుల మధ్య అందుకున్నారు. నితిన్ స్వగ్రామం గొల్లపల్లి మండలం రాఘవపట్నం. ఆయన తండ్రి ఓరుగంటి ప్రభాకర్‌రావు రిటైర్డ్ హెడ్ మాస్టర్, తల్లి రజని గృహిణి.

## సీతారామాంజనేయ ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం


ఉత్సవమూర్తుల శోభాయాత్రలో భక్తులు

**మెట్‌పల్లిరూరల్:** మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌లో శ్రీ సీతారామాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం విష్ణు సహస్రనామ పారాయణం, ఉత్సవమూర్తుల శోభాయాత్ర, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## రేచపల్లిలో పెద్దమ్మ తల్లి జాతర

**సారంగాపూర్:** మండలంలోని రేచపల్లిలో ఐదు రోజుల పాటు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న పెద్దమ్మ తల్లి బోనాల జాతరలో బుధవారం పోచమ్మతల్లికి మహిళలు బోనాలు సమర్పించారు. డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలను సమర్పించుకున్నారు. ఈ నెల 26న ప్రారంభమైన ఉత్సవాలు మార్చి 1న ముగియనున్నాయి.

## ఘనంగా ఎల్లమ్మ పట్నాలు


బోనాలతో వస్తున్న మహిళలు

**గొల్లపల్లి:** మండలంలోని చిల్వ కోడూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ పట్నాలు.బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో తరలి వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు దాసరి గంగయ్య, గుండి గంగయ్య, గర్వందుల కనుకయ్య, తాండ్ర చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో సేవలు మరువలేనివి


ఎంపీడీవోను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

**రాయికల్:** ఎంపీడీవోగా గంగుల సంతోష్‌కుమార్ సేవలు మరువలేనివని జెడ్పీటీసీ లావుడ్య సంధ్యారాణి అన్నారు. బుధవారం రాయికల్ మండల పరిషత్ కార్యాలయంలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఎంపీడీవో సంతోష్‌కుమార్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీడీవోగా సంతోష్‌కుమార్ వృత్తి పట్ల నిబద్ధత, అంకితభావంతో ప్రజలకు సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖయ్యూం, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రావు, ఎంపీవో సుష్మ, సూపరింటెండెంట్ వేణుమాధవ్, కో-ఆప్షన్‌సభ్యుడు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.